క్లుప్తంగా

ప్రజలు ఆనందంగా దీపావళి జరుపుకోవాలి


డాక్టర్ తలే రాజేష్

రాజాం: నియోజకవర్గంలోని ప్రజలంతా ఆనందంగా దీపావళి పండగను జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. బుధవారం రాజాంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలు కులాలు, మతాలకు అతీతంగా, పేద, ధనిక తారతమ్యం లేకుండా సంతోషంగా పండగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. చిన్నారులు, మహిళలు బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

పరామర్శ


కూర్మినాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

రామభద్రపురం: మండలంలోని రొంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పువ్వల కూర్మినాయుడు అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం రొపల్లి గ్రామానికి వెళ్లి కూర్మినాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి వెంట ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి సూర్యనారాయణరాజు, రామభద్రపురం పాలసొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, పారాది సర్పంచ్ ఉత్తరావల్లి ధనంజయనాయుడు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు దర్రు పైడిరాజు, తదితరులు ఉన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పరామర్శ


మహేశ్వరరావును పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్, ఎంపీపీ సురేష్‌ముఖర్జీ


రాజాం: వైఎస్సార్‌సీపీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ బుధవారం వంగర మండలం శివ్వాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కిమిడి మహేశ్వరరావును పరామర్శించారు. ఇటీవల ప్రమాదానికి గురైన మహేశ్వరరావు ఎడమభుజానికి ఆపరేషన్ అనంతరం రాజాంలో సన్‌రైజ్ ఆస్పత్రిలో కోలుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న డాక్టర్ రాజేష్‌తో పాటు వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, శివ్వాం సర్పంచ్ బొక్కేల వెంకటప్పలనాయుడు, బి.వెంకటరావు, యలకల వాసునాయుడు తదితరులు మహేశ్వరరావును పరామర్శించారు. ఆయన ఆరోగ్యంపై వాకబుచేశారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

జాగ్రత్తలు పాటించాలి

రాజాం: దీపావళి సందర్భంగా బాణసంచా కాల్చే సమయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఫైర్ సర్వీస్ రాజాం ఎస్‌ఐ టీఎస్ఎస్ జనార్దనరావు సూచించారు. స్థానిక ఫైర్ స్టేషన్ వద్ద బుధవారం విలేఖరులతో మాట్లాడారు. దీపావళి పండగను ప్రజలు సంతోష వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. చిన్నారులను టపాసులకు దూరంగా ఉంచాలని వెల్లడించారు. బాణసంచా కాల్చే సమయంలో దగ్గర్లో ఇసుక, నీటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఏవైనా ప్రమాదాలు సంభవిస్తే 51099 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం

రామభద్రపురం: మండలంలోని జన్నివలస పంచాయతీ చినసేర్లవలసకు చెందిన వ్యక్తి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన పసుపులేటి మధు (39) తొమ్మిదేళ్ల కిందట చినసేర్లవలస గ్రామానికి చెందిన పసులేటీ సీత అనే అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అప్పటి నుంచి చినసేర్లవలసలోనే


మధు (ఫైల్)

నివాసం ఉంటూ భార్యాబిడ్డలతో జీవనం సాగిస్తున్నాడు. అయితే ఈ నెల 24న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై ఆయన భార్య సీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వి.ప్రసాదరావు కేసు మోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అందని అమృతం

- నీరుగారుతున్న అమృత్ పథకం
- కుళాయిల ద్వారా కలుషిత నీటి సరఫరా
- రోగాల బారిన పడుతున్న పట్టణ ప్రజలు

రాజాం:

పట్టణాల్లో నివాసముంటున్న ప్రజలకు తాగునీరు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకాన్ని అమలు చేస్తోంది. కుళాయిల ద్వారా ఇంటింటికీ సురక్షిత తాగునీరు సరఫరా చేయడమే ఈ పథకం లక్ష్యం. ఈ లక్ష్యానికి అధికారులు తూట్లు పొడుస్తున్నారు. సురక్షిత తాగునీటిని ప్రజలకు అందించలేక చతికిలపడుతున్నారు. పట్టణవాసులకు అమృత్ పథకం అందని ద్రాక్షగా మారుతోంది.

నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం

రాజాం మున్సిపాల్టీలో అభివృద్ధి పనులు ముసుగేశాయి. మున్సిపాల్టీ అధికారుల పనితీరు నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తోందని పట్టణవాసులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. గత రెండు నెలలుగా రాజాం మున్సిపాల్టీ పరిధిలో బాబానగర్, మారుతీనగర్, మెంతిపేట, వస్త్రపురికాలనీ, మల్లయ్యపేట తదితర ప్రాంతాలకు కలుషిత తాగునీరు సరఫరా అవుతోంది. ఒకరోజు నీటిని సరఫరా చేస్తే మరో మూడు, నాలుగు రోజుల వరకు నీటి సరఫరా నిలిచిపోతోంది. పట్టణంలో 50 వేల మంది జనాభాకు సరిపడే వాటర్ ట్యాంకులు లేవు. 2008లో అప్పటి పట్టణ జనాభా అవసరాలకు తగ్గట్టు ఇక్కడ వాటర్ ప్లాంట్లు నిర్మించారు. ఇప్పుడు జనాభా పెరిగింది. నాగావళి నది నుంచి ఇక్కడకు తాగునీటి సరఫరా జరుగుతుంది. గతేడాది కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకంలో భాగంగా రాజాం మున్సిపాల్టీలో తాగునీటిని ప్రతీ ఒక్కరికి అందించేందుకు రూ. 49 కోట్లు మేర నిధులు వెచ్చించింది. 10 ఎంఎల్‌డీ ప్రాజెక్ట్‌ను అంచనా వేశారు. పనులు జరుగలేదు. దీంతో పట్టణంలో శివారు ప్రాంతాలకు ఇప్పటికీ ట్యాంకుల ద్వారా నీటిని అందిస్తున్నారు. పట్టణంలోని ప్రధాన వీధులకు కలుషిత నీరే నాలాలు ద్వారా సరఫరా అవుతోంది.


మెంతిపేటలో కలుషిత నీటి సరఫరా..


బాబానగర్‌లో సరఫరా అవుతున్న కలుషిత నీరు

విజృంభిస్తున్న రోగాలు

రాజాం పట్టణంలో వైరల్ జ్వరాలు, చర్మ సంబంధిత వ్యాధులు విజృంభిస్తున్నాయి. రాజాం ఏరియా ఆస్పత్రిలో నమోదౌతున్న ఓపీల్లో ఎక్కువగా జ్వరపీడితులు, చర్మ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారే ఉన్నారు. వారిలో ఎక్కువ మంది రాజాం పట్టణానికి చెందినవారు కావడం గమనార్హం. ఇంత జరుగుతున్న మున్సిపల్ అధికారులు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు అధిగమించేందుకు కనీస చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాజాం పట్టణంలో తాగునీటి సమస్యపై కమిషనర్ జె.రామప్పలనాయుడు సైతం స్పందించకపోవడంతో పట్టణవాసులకు ఇప్పట్లో తాగునీటి కష్టాలు తప్పేట్టులేవు.

ఆర్గానిక్ సాగుపై అవగాహన


జి.ఎస్.పురంలో రైతులకు సాగు సలహాలు ఇస్తున్న ఏఓ నవీన్

సంతకవిటి: మండలంలోని జి.ఎస్.పురం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్గానిక్ సాగు, చీడపీడల నివారణ, నూతన సాగు యాజమాన్య పద్ధతులపై మండల వ్యవసాయాధికారి పైల నవీన్ రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ రావు రవీంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

వంగర: పంటల సాగులో రైతులు మెలకువలు పాటించాలని ఏఓ తట్టికోట కన్నబాబు తెలిపారు. బుధవారం మండల పరిధి ఎం.సీతారాంపురం, తలగాం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటల సాగులో మెలకువలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులుపాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి: ఆర్డీఓ

బొబ్బిలి: పట్టణంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల్లో నిబంధనలు పాటిస్తూ అగ్నిప్రమాద నివారణ పరికరాలు, నీరు, ఇసుక ఏర్పాటు చేసుకోవాలని ఆర్డీఓ జేవీఎస్ఎస్ రామమోహనరావు అన్నారు. పట్టణంలో లైసెన్సులు మంజూరైన ఐదు బాణసంచా దుకాణాలను బుధవారం సాయంత్రం తహసీల్దార్ ఎం.శ్రీను, కమిషనర్ ఎల్.రామలక్ష్మిలతో కలిసి పరిశీలించారు. పట్టణంలోని ఫ్లైఓవర్ వద్ద ఏర్పాటు చేసిన ఐదు బాణసంచా దుకాణాల్లో నాలుగు చొప్పున ఏర్పాటు చేసిన అగ్నిప్రమాద నివారణ పరికరాలను, ఇసుక, నీటి లభ్యతలను పరిశీలించారు.

నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు

బాడంగి: ప్రభుత్వ నిబంధనల ప్రకారం జనావాసాలకు దూరంగా మెయిన్ రోడ్డుకు 50 మీటర్ల దూరంలో బాణసంచా అమ్మకాలు చేపట్టాలని, నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్‌లు రద్దుచేయడం జరుగుతుందని డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని ఫైర్‌వర్క్స్ షాపులను బుధవారం తనిఖీ చేశారు. దుకాణాల వద్ద అగ్నిప్రమాదాలు, పేలుడు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని యజమానులకు సూచించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్

తెర్లాం: మండలంలోని రంగప్పవలస గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నెలకొన్న సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని తహసీల్దార్ హేమంత్‌కుమార్ అన్నారు. రంగప్పవలస గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో బుధవారం ఆయన పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వర్షాకాలంలో చెరువు నుంచి నీరు కాలనీలోకి వచ్చి ఇళ్లలోకి చేరుతుందని స్థానికులు వాపోయారు. తహసీల్దార్ స్పందిస్తూ.. సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం


సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

బొబ్బిలి: పట్టణ ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో రోడ్ల విస్తరణ నిర్వాసితులకు టీడీఆర్ బాండ్ల జారీలో భారీ అవినీతి జరిగిందని, దీన్ని ఇన్నాళ్లు ఎందుకు గోప్యంగా ఉంచారని మున్సిపల్ కౌన్సిలర్లు రాంబార్కి శరత్, ఇంటి గోవిందరావు తదితరులు అధికారులను నిలదీశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సిబ్బంది తనిఖీలు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. బొబ్బిలి మున్సిపాలిటీ అధికారులు జారీ చేసిన టీడీఆర్ బాండ్ల విలువ, స్థలం విలువలపై పూర్తి వివరాలను ఇవ్వాలని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను డిమాండ్ చేశారు. వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ, కమిషనర్ ఎల్.రామలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు


తహసీల్దార్ కార్యాలయంలో భూ రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో

రామభద్రపురం: రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. భూ సమస్యలకు సంబంధించిన పలు రికార్డులు పరిశీలించారు. గ్రామ రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీల పరిష్కారంపై తహసీల్దార్ సులోచనరాణిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొట్టక్కిలో వచ్చిన భూ సమస్యపై క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారు. అలాగే కోటశిర్లాంలో జరిగిన గ్రామసభను సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గతంలో చేపట్టిన రీసర్వేలో సాంకేతిక కారణాలు వలన జరిగిన పొరపాట్లను సరిచేసేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు తమ సమస్యలను వినతుల రూపంలో అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డీటీ గిరిధర్, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

బాడంగి: రెవెన్యూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.సుధాకర్ తెలిపారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసర్వే-భూహక్కు పేరుతో గతంలో జరిగిన రీసర్వేలో చోటుచేసుకున్న తప్పులు, పొరపాట్లను సరిదిద్దేందుకు రైతుల నుంచి వినతులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా జాయింట్ ఎల్పీఎంలను విడగొట్టమని, ఖాతాలను రద్దుచేయాలని, సర్వే నంబర్ కోరిలేషన్స్ చేయమని, విస్తీర్ణాలలో మార్పులు చేయాలని, మ్యుటేషన్ చేయాలని కోరుతూ వినతులు అందుతున్నట్లు తెలిపారు. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. బాడంగి గ్రామసభలో సుమారు 50 వినతులు వచ్చినట్లు వీఆర్‌ఓ వెంకటరమణ, గ్రామ సర్వేయర్ రాజు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ఎంవీ రమణ, రీసర్వే డీటీ అప్పలనాయుడు, సర్పంచ్ కండి రమేష్, ఉపసర్పంచ్ మరడాన రాము, రైతులు పాల్గొన్నారు.

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామసభలు

రేగిడి: గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములు రీసర్వే జరిపిన గ్రామాల్లో రెవెన్యూ అధికారులు గ్రామసభలు నిర్వహించి, రైతుల సమస్యలు పరిష్కరిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని వన్నలి గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. రైతులకు సంబంధించిన భూములు 1బీలో సక్రమంగా లేకపోయినా, సర్వే చేసినా భూములు రికార్డుల్లో నమోదుకాకపోయినా వాటిని సరిచేస్తున్నారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసరావు, వీఆర్‌ఓ రామకృష్ణ, సర్వేయర్ శ్రీనివాసరావు, సర్పంచ్ గార రమణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వికాసతరంగిణి సభ్యులు

రాజాం సిటీ: స్థానిక వికాసతరంగిణి కార్యాలయంలో వచ్చే నెల 9న విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నామని వికాసతరంగిణి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి టీటీపీ రమణమూర్తి తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు. శ్రీరామాయణం బాలకాండ 31వ సర్గ నాలుగవ శ్లోకం సందర్భాన్ని చిత్రరూపంలో విద్యార్థులు ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. 5,6,7 తరగతుల విద్యార్థులు ఒక భాగంగా, 8,9 తరగతుల విద్యార్థులు రెండో భాగంగా ఈ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో వికాసతరంగిణి అధ్యక్షులు వి.పైడిరాజు, మానవతా సంస్థ అధ్యక్షులు బీవీ అచ్యుత్‌కుమార్, గట్టి పాపారావు, పొదిలాపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

పింఛన్ పంపిణీ లక్ష్యాలు చేరుకోవాలి

బాడంగి: నవంబరు నెల సామాజిక పింఛన్లను ఒకటో తేదీ నాడే శతశాతం పంపిణీ పూర్తిచేయాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశమై పింఛన్ల పంపిణీపై పలు సూచనలు చేశారు. మండలంలో 239 క్లస్టర్ల పరిధిలో సుమారు 8,500 మంది సామాజిక పింఛన్ల లబ్ధిదారులు ఉన్నారన్నారు. సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేయాలని సూచించారు. గ్రామంలో ఒకచోట కూర్చొని పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఉచిత 'గ్యాస్ మాటలే'

బొబ్బిలి: కూటమి ప్రభుత్వం తమ ఎన్నికల ప్రచారంలో ప్రతీ ఇంటికీ(మహిళలందరికీ) ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఇస్తామని ఇచ్చిన హామీ ఉత్తి గ్యాస్ మాటలేనని తేలిపోయిందని ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా కో-కన్వీనర్ గర్భాపు రమేష్ అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో కోటీ 85 లక్షల మంది అర్హులు ఉంటే వివిధ నిబంధనలు పెట్టి కేవలం కోటి మందికే ఉచిత గ్యాస్ ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వారిలో గ్యాస్ బండలు అందేది ఎంతమందికనే విషయం వచ్చే నెలలో తేలుతుందన్నారు. ప్రతీ ఒక్క కుటుంబానికి గ్యాస్ సిలెండర్‌ను ఉచితంగా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

సైకిళ్ల పంపిణీ

సంతకవిటి: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9 మంది నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు బుధవారం సైకిళ్లు పంపిణీ చేశారు. వి.కె యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్ సౌజన్యంతో సైకిళ్లు పంపిణీ చేసినట్లు హెచ్ఎం వి.వెంకటరావు తెలిపారు. సర్పంచ్ జోల తిరుపతి, మొయ్యి నారాయణప్పడు పాల్గొన్నారు.

గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు

రాజాం సిటీ: గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించేందుకు మద్యం సరఫరా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర హెచ్చరించారు. రూరల్ సర్కిల్ కార్యాలయంలో రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లోని వైన్‌షాపుల యజమానులతో బుధవారం సమావేశం నిర్వహించారు. వైన్‌షాపుల నుంచి బెల్టు షాపులకు మద్యం తరలిస్తే చర్యలు తప్పవని అన్నారు. అలాగే గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించిన వారిపై కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వహణకు పాటలు పాడడం చేయకూడదని స్పష్టం చేశారు.

మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

బొబ్బిలి: మండలంలోని జగన్నాథపురానికి చెందిన వారణాసి నాగరాజు 19 మద్యం సీసాలను తరలిస్తుండగా బొబ్బిలి పట్టణంలోని చర్చి సెంటర్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై టి.సన్యాసిరావు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

మెరుగైన బోధన అందించాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని ఎంఈఓ జె.త్రినాథరావు అన్నారు. మండలంలోని గోపాలవలస పంచాయతీ జగన్నాథవలస గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు వండి పెట్టాలని, పాఠశాల ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా చేసేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఉపాధి పనుల ప్రణాళికలు సిద్ధం

రేగిడి: గ్రామాల్లో ఉపాధి వేతనదారులకు పని కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఏపీఓ ఎస్.హరనాథరావు అన్నారు. మండలంలోని పుర్లి, దేవుదల తదితర గ్రామాల్లో బుధవారం ఉపాధి గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ వ్యవసాయ వనరులను అభివృద్ధిపరచుకునేందుకు ఉపాధిహామీ పనులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. తోటలు, కాలువలు, చెరువులు తదితర వాటిని ఉపాధిహామీ పనుల ద్వారా బాగుచేసుకోవచ్చన్నారు. సర్పంచ్ ఎర్నేని రామినాయుడు, టీపీ త్రినాథరావు, వేతనదారులు, రైతులు పాల్గొన్నారు.

15లోగా బీమా ప్రీమియం చెల్లించాలి

బొబ్బిలి రూరల్: మండలంలోని జీడిరైతులు నవంబరు 15లోగా బీమా ప్రీమియం చెల్లించాలని, మొక్కజొన్న రైతులు డిసెంబరు 15లోగా చెల్లించాల్సి ఉందని వ్యవసాయశాఖ ఏడీ మజ్జి శ్యాంసుందర్ తెలిపారు. మండలంలోని బుధవారం మెట్టవలస, పెంట గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంట పొలాల్లో పొటాషియం ఎరువు ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. రానున్న రబీ సీజన్‌కు సంబంధించి అపరాల పంటల సాగుపై అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు, వీవీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

నరకాసురుని సంహారం

బొబ్బిలి: నరక చతుర్దశిని పురస్కరించుకుని పట్టణంలోని సింగారపు వీధిలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం నరకాసుర సంహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బేబీనాయన ధనుస్సుతో భారీ నరకాసురుని విగ్రహాన్ని సంహరించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజలందరి జీవితాల్లో సంతోషాల వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. పెద్ద ఎత్తున ప్రజలు సంబరాల్లో పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

వంగర: మార్చిలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు మద్రాపు ప్రసాద్, పెంకి గౌరీశంకరరావు పిలుపునిచ్చారు. మండలంలోని మడ్డువలస, వంగర గ్రామాల్లో బుధవారం పర్యటించారు. నవంబరు 6 లోగా ఉపాధ్యాయులంతా ఓటర్లుగా నమోదు కావాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పి.మురళీ, పి.శ్రీరాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పంటసాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

బాడంగి: రైతులు వరి, అపరాలు, తదితర పంటలసాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, సర్పంచ్ కండి రమేష్ సూచించారు. బాడంగిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ సిబ్బంది పంట పొలాలను పరిశీలించారు. పంట తెగుళ్ల నివారణ, ఎరువుల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగుచేయడం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు తవిటినాయుడు, స్వామినాయుడు, పెంట రామకృష్ణ, మరడాన రాము, రైతులు, వీఏఏ జయలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రిమెంట్ పూర్తయిన పనులు ప్రారంభించాలి

బొబ్బిలి: పట్టణంలోని 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే పనులకు సంబంధించి ఇటీవల అగ్రిమెంట్ పూర్తయిన వాటని వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ తన ఛాంబర్‌లో ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ సెక్రటరీలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రతీ వార్డులో శానిటేషన్ పనులు సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. మున్సిపల్ డీఈఈ జి.కిరణ్‌కుమార్, ఏఈలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముందస్తు దీపావళి వేడుకలు

రాజాం సిటీ: పట్టణంలోని పలు పాఠశాలల్లో ముందస్తు దీపావళి వేడుకలు బుధవారం నిర్వహించారు. బుచ్చెంపేట ఎంపీపీ పాఠశాల, సన్ స్కూల్‌లో విద్యార్థులకు దీపావళి విశిష్టతను వివరించారు. మందుగుండు కాల్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అలాగే విద్యార్థులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు.

తుప్పల తొలగింపు

తెర్లాం: మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో ప్రధాన రోడ్లకు ఇరువైపులా దట్టంగా పెరిగిన తుప్పలు, డొంకలను తొలగించాలని ఎంపీడీవో రేగి రాంబాబు, ఈఓపీఆర్‌డీ నీలిమ అన్నారు. మండలంలోని తెర్లాం, గంగన్నపాడు, ఎం.ఆర్.అగ్రహారం, వెలగవలస తదితర గ్రామాల్లో రోడ్లుకు ఇరువైపులా పెరిగిన తుప్పలు, డొంకల తొలగింపు కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు.